ప్రజాశక్తి

సోమవారం 21 అక్టోబర్ 2024 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

నీటి శుద్ధిపై నిర్లక్ష్యం



ఈ నెల 14న కంకిపాడులో జరిగిన పల్లెపండుగ ప్రారంభ సభలో కలుషిత నీటిని చూపుతున్న డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ (ఫైల్)

- పంచాయతీల్లో మురికి నీరు సరఫరా
- తక్షణం ఫిల్టర్‌బెడ్‌లు మార్చాలని నివేదికలు
- గుడివాడలో 44 గ్రామాలకు రూ.3.50 కోట్లతో ప్రతిపాదనలు
- గతేడాది కృష్ణాలో 53 ఫిల్టర్‌బెడ్‌లు మార్చడానికి రూ.8 కోట్లతో టెండర్లు
- కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో సాగని పనులు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

గ్రామ పంచాయతీల్లోని తాగునీటి నిల్వ చెరువుల్లో ఫిల్టర్ బెడ్‌ల నిర్వహణపై ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. నీరు ఫిల్టర్ అవ్వకపోవడంతో కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఉన్న 497 గ్రామ పంచాయతీల్లోని 2,18,375 కుళాయిల్లో అత్యధిక కుళాయిల ద్వారా రంగు మారిన మురికి నీరే సరఫరా అవుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ప్రజారోగ్యం ఫిల్టర్ అవుతోందని గ్రామీణ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. కృష్ణాజిల్లాలో అవసరమైన అన్ని ఫిల్టర్‌బెడ్‌లు మార్చడానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాల్సి ఉంది.

సమస్య తీవ్రత ఇలా

గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గంలోని 44 గ్రామ పంచాయతీల్లో రంగుమారిన మురికి నీరు కుళాయిల్లో సరఫరా అవుతోంది. ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల కంకిపాడులో జరిగిన 'పల్లెపండుగ, గ్రామ పంచాయతీ వారోత్సవాలు' ప్రారంభం సభలో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. ఉపముఖ్యమంత్రి ఆదేశాలతో ఈ గ్రామాల్లో సరఫరా అవుతున్న తాగునీటిని అధికారులు బృందం పరిశీలించింది. ఈ గ్రామాల్లోని ప్రభుత్వ తాగునీటి సరఫరా పథకాల్లో నీటిని శుద్ధి చేయడానికి ఉపయోగించే అన్ని ఫిల్టర్ బెడ్‌లు పనికిరాకుండా పోయాయని తేల్చేశాయి. 44 శాండ్ ఫిల్టర్ బెడ్‌ల ఏర్పాటుకు (మిగతా 2లో)



ఈతకెళ్లి ఇద్దరు బిటెక్ విద్యార్థుల దుర్మరణం

గన్నవరంలో విషాదఛాయలు

రోడ్డు ప్రమాదంలో తల్లీ కొడుకు మృతి

తండ్రి, మరో కుమారుడికి గాయాలు



వార్తలు మెయిన్‌లో

బ్యారేజీకి కొనసాగుతున్న వరద

ఇన్‌ఫ్లో 1.62, ఔట్‌ఫ్లో 1.57 లక్షల క్యూసెక్కులు

ప్రజాశక్తి-విజయవాడ: ప్రకాశం బ్యారేజీకి వరద నీరు కొనసాగుతూనే ఉంది. కృష్ణానది ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద నీటిని ఇరిగేషన్ అధికారులు దిగువకు పంపిస్తున్నారు. 1,62,689 క్యూసెక్కుల వరద నీరు బ్యారేజీకి వచ్చి చేరుతుండగా, 1,57,250 క్యూసెక్కుల నీటిని 20 గేట్లను నాలుగు అడుగులు, 50 గేట్లను మూడు అడుగుల మేర ఎత్తి దిగువకు పంపిస్తున్నారు. మరో 5,439 క్యూసెక్కుల నీటని కెవి మెయిన్, కెడబ్ల్యు మెయిన్ కెనాల్స్‌కు తరలిస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజి నీటిమట్టం 12 అడుగులు ఉంది.

పున్నమిఘాట్‌ను శుభ్రంగా ఉంచండి : కమిషనర్

ప్రజాశక్తి-విజయవాడ: పున్నమి ఘాట్‌ను మరింత అందంగా పరిశుభ్రంగా ఉంచాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ఈ నెల 22వ తేదీ సాయంత్రం 6:30 గంటల నుండి పున్నమి ఘాట్ బబ్బూరి గ్రౌండ్స్‌లో జరిగే డ్రోన్ సమ్మిట్‌లో భాగంగా డ్రోన్ షో నిర్వహణ ఏర్పాట్లను అధికారులతో కలిసి కమిషనర్ ఆదివారం పరిశీలించారు. కృష్ణానది తీరంలో పున్నమి ఘాట్ వద్ద రైలింగ్ దగ్గర పేరుకుపోయిన వ్యర్థాలను చూసి త్వరగా తీసేవేయాలని అధికారులను ఆదేశించారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా గ్రౌండ్ ఉంచేటట్టు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నిర్ణీత ప్రాంతాలలో తాగునీటి పాయింట్లు, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలన్నార. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి చంద్రశేఖర్, చీఫ్ ఇంజనీర్ శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ ప్రసాద్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ ఇంచార్జ్ డాక్టర్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఇందిరా గాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో సోమవారం జరుగుతున్న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ ఏర్పాట్లను నగర కమిషనర్ ధ్యానచంద్ర పరిశీలించారు. పార్కింగ్, గ్రౌండ్ అరేంజ్మెంట్స్, పెరేడ్ మార్కింగ్ ట్రాక్స్, తాగునీటి సరఫరా, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాట్లను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. వేడుకలకు ఎటువంటి అంతరాయం



కలగకుండా జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్టేట్ ఆఫీసర్ టి శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ రద్దు

ప్రజాశక్తి-విజయవాడ: డ్రోన్ సమ్మిట్, డ్రోన్ షో సందర్భంగా ఎన్‌టిఆర్ జిల్లాలోని అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బందికి విధులు కేటాయించినందున ఈ నెల 21వ తేదీ సోమవారం కలెక్టరేట్లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ డా.నిధిమీనా ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. అలాగే ప్రతి సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈ నెల 21వ తేదీ పోలీసు అమరవీరుల సంస్మరణ దినం నేపథ్యంలో అధికారులు, సిబ్బంది బందోబస్త్ విధులలో ఉన్నందున రద్దు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు తెలిపారు.

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎంఎస్ సి సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ అండ్ పొల్యూషన్ కంట్రోల్ (వాటర్, ఎనర్జీ, ఆయిల్, గ్యాస్) కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విభాగాధిపతి ఆచార్య పి.బ్రహ్మాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో ప్రవేశాలు పొందేందుకు బీఎస్సీ, బీటెక్ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులుగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఆయా కోర్సుల్లో ఏ బ్రాంచ్‌లో ఉత్తీర్ణులైన కూడా అర్హత కల్పిస్తామని తెలిపారు. కోర్స్ ఫీజు రూ.20 వేలుగా నిర్ణయించినట్లు బ్రహ్మాజీ రావు వివరించారు. కొద్ది సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. వివరాలకు 9441924560 ఫోన్ నెంబర్ ను సంప్రదించవచ్చునని బ్రహ్మాజీరావు పేర్కొన్నారు.

నివాసాల మధ్య మద్యం షాపు తొలగించాలని వినతి

ప్రజాశక్తి-తాడేపల్లి: తాడేపల్లి పట్నం నుండి సుందరయ్య నగర్ వెళ్లే 42 అడుగుల రోడ్డు లో ఉన్న బార్ షాప్ పు తొలగించాలని ఐద్వా ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అధికారి ప్రతి రోజాకు వినతి పత్రం అందజేశారు. జనావాసాల మధ్య ఉన్న ఈ బారు వల్ల తాగుబోతులు కిక్కు ఎక్కువై రోడ్డు మీద వీరంగం వేస్తున్నారని మహిళలు తెలిపారు. వచ్చిపోయేవారిపట్ల అసభ్యంగా ప్రవర్తించడంతోపాటు ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. పంట పొలాల పక్కనే తమ వాహనాలను పార్కింగ్ చేసి, అక్కడే మద్యం తాగి ఖాళీ బాటిల్స్‌ను పొలాల్లో పడవేయడం పట్ల రైతులు కూడా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల మధ్య ఉన్న ఈ బార్ షాపు వల్ల పెద్దలతోపాటు, పిల్లలపై కూడా దుష్ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు. జిల్లా అధికారికి అర్జీ ఇచ్చిన వారిలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు. సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు. ఐద్వా నాయకులు కే ఉష. భ్రమరాంబ. భాగ్యలక్ష్మి. లక్ష్మీ భ్రమరాంబ, జ్యోతి, సతీదేవి ఉన్నారు.

మొదటిపేజీ తరువాయి

నీటి శుద్ధిపై నిర్లక్ష్యం

రూ.3.50 కోట్లతో ప్రతిపాదనలు పంపాయి. ఇది ఈ ఒక్క నియోకవర్గంలోని సమస్య మాత్రమే కాదు... కృష్ణాజిల్లాలో 263 చెరువులకు అనుసంధానంగా ఉన్న తాగునీటి పథకాలకు అనుసంధానంగా ఉన్న అత్యధిక ఫిల్టర్ బెడ్‌లు దెబ్బతిన్నాయి.

గతంలోనూ ప్రతిపాదనలు

గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గంతో పాటు, పెడన, అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గాల్లో 53 నూతన ఫిల్టర్ బెడ్‌లను ఏర్పాటు చేయడానికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సబులిటీ (సిఎస్ఆర్) నిధులు రూ.8.59 కోట్లతో పనులు చేయడానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు 2023 నవంబర్‌లోనే టెండర్లు ఆహ్వానించారు. కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో ఫిల్టర్‌బెడ్‌లు ఏర్పాటవ్వలేదు.

సమస్య పరిష్కారం అయ్యేనా?

తాగునీటి కాలుష్యంతో జిల్లాలోని పలు గ్రామాల్లో గతంలో అతిసార వ్యాధి ప్రబలింది. గన్నవరం మండలం తెంపల్లి, పామర్రు మండలంలోని రెండు గ్రామాలు, గుడివాడ పట్టణంలోనూ ఈ సమస్య తలెత్తింది. ఆయా సందర్భాల్లో పలువురు మృతి చెందారు. ఇంత జరిగినా రక్షిత చెరువుల్లోని నీటిని వడపోయడంలో కీలకంగా ఉండే ఫిల్టర్ బెడ్‌లను మార్చడానికి మాత్రం ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. తాజాగా ఉపముఖ్యంత్రి పవన్ దృష్టికే ఎమ్మెల్యే నేరుగా సమస్యను తీసుకువెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ క్రమంలోనే త్వరగా సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఊరూరా ఘంటసాల చైతన్య వేదిక కార్యక్రమాలు

- **13వ రాష్ట్ర మహాసభలో వక్తలు**

ప్రజాశక్తి-విజయవాడ : రాష్ట్రస్థాయిలో ఘంటసాల సాంస్కృతికోద్యమం సాగాలని, ఇందుకు ఘంటసా చైతన్య వేదిక ఆధ్వర్యంలో జిల్లాల్లో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తామని పలువురు వక్తలు అన్నారు. ఆలిండియా ఘంటసాల చైతన్య వేదిక 13వ రాష్ట్ర మహాసభలు విజయవాడ కౌతావారి కళావేదికలో ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆలిండియా ఘంటసాల చైతన్య వేదిక అధ్యక్షులు కోటా వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షత వహించారు. అమరావతి రాజధానిలో 25 అడుగులతో ఘంటసాల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, ఎన్టీఆర్, ఘంటసాలకు భారతరత్న ప్రకటించాలని, హైదరాబాదులో లాగా ట్యాంక్ బండ్ ఏర్పాటు చేసి తెలుగుజాతి మహనీయులు, స్వాతంత్ర్య సమరయోధులు, శాస్త్రవేత్తలు, కవులు, రచయితలు, కళాకారుల విగ్రహాలను ఏర్పాటు చేసి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, ఘంటసాల గానవైభవాన్ని హైస్కూల్ విద్యార్థులకు పాఠ్యాంశంగా చేర్చాలని, ఘంటసాల మ్యూజియం ఏర్పాటు చేయాలని మహాసభలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో నవ్యాంధ్ర రాజధాని



ఘంటసాల విగ్రహ సాధన కమిటీ కార్యదర్శి చింతకాయల చిట్టిబాబు, ఘంటసాల చైతన్య వేదిక కోర్ కమిటీ కన్వీనర్ కె.వి.ప్రసాద్ (కాకినాడ) , వివిధ జిల్లాల నుంచి ఘంటసాల సంఘాల నాయకులు పాల్గొన్నారు. అనంతరం వంద పాటలతో నిర్వహించిన సంగీత విభావరి వీక్షకులను ఎంతో అలరించింది. ఈ సంగీత విభావరిలో గాయనీ గాయకులు బొబ్బిలి మల్లేశ్వరి, సిహెచ్ రజిని, సిహెచ్ వాసు, ఝాన్సీ, మంగరాజు, శ్యాంప్రసాద్, కారుమంచి రాజు, జయ ప్రభు, ఎం.శివశంకర్‌రావు ఆచారి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు ఒత్తిడిని అధిగమించాలి : ఎమ్మెల్సీ కెఎస్

ప్రజాశక్తి-గుంటూరు

ఉపాధ్యాయులు బోధనతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనటం ద్వారా మానసిక ఒత్తిడిని అదిగమించాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడలు, సాంస్కృతిక పోటీల బహుమతి ప్రధానోత్సవం యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.ఆదిలక్ష్మి అధ్యక్షతన బ్రాడీపేటలోని సంఘ కార్యాల యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ రావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పని ఒత్తిడి పెరిగిందని, దీంతో అనారోగ్యాలకు గురవుతుని, కొన్ని సార్లు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. నిత్యంతో మానసిక ఒత్తిడితో ఉండే ఉపాధ్యాయులు దానికి అధిగమించటానికి క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల రోజువారీ జీవితంలో భాగంగా చేసుకోవాలన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో క్రీడలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించడం జరిగిందని ఈ ఘనత యూటీఎఫ్‌కు మాత్రమే దక్కుతుందని అన్నారు. టీచర్లు పెద్ద సంఖ్యలో పోటీలలో పాల్గొనటం అభినందనీయం అన్నారు.

ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించండి

మంత్రి లోకేష్‌కు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ లేఖ

ప్రజాశక్తి-తాడేపల్లి

ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరి ంచాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ, మంగళగిరి ఎమ్మెల్యే, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కు ఆదివారం లేఖ రాశారు. అక్రమ లాకౌట్ ప్రకటించి ఇప్పటికీ 32 సంవత్స రాలు అయిన సంగతి వివరించారు. సెంట్రల్ లేబర్ ట్రిబ్యునల్ కోర్ట్, హైకోర్టు, ఫ్యాక్టరీ కి సంబంధించిన భూములు అమ్మి, రూ.43 వేల కోట్లు కార్మికులకు చెల్లించమని ఆదే శించిన సంగతిని కూడా లేఖలో మంత్రి దృష్టికి తెచ్చారు. కోర్టు ఉత్తర్వులను కూడా ఇప్పటివరకు అమలు జరపలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ అక్రమ లాకౌట్ ప్రకటించేనాటికి 333మంది కార్మికులు పని చేస్తుండగా, వారిలో 160 మంది కార్మికులు అనారోగ్యంతో, అర్థాకలితో మరణించడం జరిగిందని ఆందోళన వెలి బుచ్చారు. సిమెంట్ ఫ్యాక్టరీకి కోట్లాది రూపాయల విలువచేసే భూములు ఉన్న సంగతిని గుర్తు చేశారు. రాష్ట్ర మంత్రిగా ఫ్యాక్టరీ భూములను వెంటనే అమ్మించి, కార్మికులకు నష్ట పరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు విఎంసిలో గ్రీవెన్స్

ప్రజాశక్తి-విజయవాడ

విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయాల్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయాల్లో గ్రీవెన్స్ కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు ఉదయం పది గంటల నుండి తమ ఫిర్యాదులను అందజేయవచ్చని పేర్కొన్నారు.

నేడు శ్రీ కృష్ణవేణి స్కూల్ 40వ వార్షికోత్సవం

విజయవాడ : విద్యా రంగంలో గత నాలుగు దశాబ్దాలుగా విశిష్ట సేవలందించిన పోరంకిలోని ప్రముఖ విద్యాసంస్థ చిగురుపాటి శ్రీ కృష్ణవేణి ఎడ్యుకేషనల్ అకాడమీ 40 వార్షికోత్సవం ఈ నెల 21వ తేదీ సోమవారం నిర్వహిస్తున్నట్లు స్కూల్ డైరెక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. తల్లిదండ్రులు, విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి పోలీసు అమరవీరుల స్మారకోత్సవాలు : ఎస్‌పి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతీ ఏటా నిర్వహించే పోలీసు అమరవీరుల స్మారకోత్సవాలు సోమవారం నుండి ఘనంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు తెలిపారు. ఈనెల 21 వ తేదీ నుండీ 31 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో జరగనున్నాయన్నారు. విధి నిర్వహణలో అసువులు బాసిన అమర పోలీసును గుర్తు చేసుకోవడంతో పాటు సమాజంలో పోలీసుల కీలకమైన పాత్ర, విధులు, త్యాగాలు గురించి ప్రజల్లో అవగాహన తీసుకురావడమే ముఖ్య ఉద్దేశ్యంగా స్మారకొత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్టోబరు 21వ తేదీన ఉదయం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అమర వీరుల స్థూపం వద్ద పోలీసు అమర వీరుల సంస్మరణ దినం ఘనంగా నిర్వహించనున్నామన్నారు. అలాగే 21వ తేదీ నుండి 31వ తేదీ వరకు ప్రతి పోలీస్ స్టేషన్ల పరిధిలో ముఖ్యమైన కూడళ్ళ వద్ద పోలీస్ అమరవీరులకు సంబంధించిన బ్యానర్స్ హెూర్డింగ్స్ ఫ్లెక్సీలు ప్రదర్శించబడతాయన్నారు. పోలీస్ ఫ్లాగ్‌ను పోలీసు అధికారులు, సిబ్బంది ధరించాలని, ప్రజలు పోలీసువారి త్యాగాలను స్మరించుకుంటూ ధరించేలా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. 22వ తేదీ నుండి 31వ తేదీ వరకు జిల్లా పోలీస్ కార్యాలయం లోను, పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీసులు విధి నిర్వహణలో ఉపయోగించేసి ఆయుధాలు,పరికరాలు, సాధనాలు, సాంకేతిక ఉపకరణాలతో ఓపెన్ హౌస్ ప్రదర్శన నిర్వహించి విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు.



పోలీస్ అమరవీరుల స్వగ్రామల సందర్శన

జిల్లాలోని పోలీసు అమర వీరుల గ్రామాల సందర్శన, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అమరలైన పోలీస్ సిబ్బంది త్యాగాలను స్మరిస్తూ జ్ఞాపికలను అందజేస్తామన్నారు. అమర వీరుల సేవలను వివరించడం, డిఎస్పీ స్థాయి పోలీసు అధికారులు, సిబ్బంది పోలీసు అమర వీరుల గ్రామాలు/పట్టణాలు సందర్శిస్తా మన్నారు.

వక్తృత్వపు,వ్యాస రచన పోటీలు

24వ తేదీ నుండి 27వ తేదీ వరకు సైబర్ నేరాల అరికట్టేందుకు తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలపై వ్యాసరచన వక్తత్వపు పోటీలు విద్యార్థులకు నిర్వహించనున్నారు. జిల్లాలోని వివిధ పాఠశాలు/ కళాశాలల్లోని విద్యార్థులకు చర్చా వేదికలు, వ్యాస రచన, వక్తత్వపు పోటీలు పోలీసు అధికారులు నిర్వహిస్తారన్నారు. ఇందులో భాగంగా పర్యావరణ పరిరక్షిం చుటలో పోలీసుల పాత్ర అనే అంశంపై పోలీస్ సిబ్బందికి వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు నిర్వహిస్తారన్నారు.

రక్త దాన శిబిరాలు

28వ తేదీ బ్లడ్ డొనేషన్ క్యాంప్‌లలో పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొని రక్తదానం చేయనున్నారు. అన్ని సబ్-డివిజన్లలో పోలీసుల కుటుంబాలకు మెడికల్ క్యాంప్ నిర్వహిస్తామన్నారు.



శ్మశానవాటిక అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి-చల్లపల్లి : గ్రామ ప్రముఖుడు సజ్జా చలపతిరావు స్థానిక హిందూ శ్మశాన వాటికకు పది లక్షల భూరి విరాళం ప్రకటించి, మొదటి దఫా ఐదు లక్షలు అందించారు. ఆదివారం అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాదు, గ్రామ సర్పంచ్ పైడి పాముల కష్ణకుమారి సమక్షంలో సమక్షంలో ఐదు లక్షల రూపాయలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ సుందర చల్లపల్లి నిర్మాత ప్రముఖ వైద్యులు డిఆర్కె ప్రసాద్, డాక్టర్ పద్మావతి ఉన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పరీక్ష

ప్రజాశక్తి - గుడివాడ : భారత ప్రభుత్వ తపాలా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా దీనదయాళ్ స్పర్శయోజన స్కాలర్షిప్ పరీక్షలు నిర్వహించింది. ఆదివారం స్థానిక రాజేంద్రనగర్‌లోని విద్యాలయ పబ్లిక్ స్కూల్‌లో 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు పోస్టల్ ఇన్స్పెక్టర్ కె. సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఈ ప్రతిభా పరీక్షలో పట్టణంలోని సుమారు 200 మంది వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుడివాడ డివిజన్ తపాలా శాఖ సూపరింటెండెంట్ చల్లా అప్పారావు మాట్లాడుతూ జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్‌లో జరిగే ప్రథమ స్థాయి పరీక్షలో ఉత్తీర్ణులు అయినవారికి స్టాంప్స్ సేకరణపై ద్వితీయ స్థాయి ప్రాజెక్టు వర్క్ నిర్వహిస్తామన్నారు. అర్హత పొందిన విద్యార్థినీ విద్యార్థులకు సంవత్సరానికి రూ.6000లు భారత ప్రభుత్వం, పోస్టల్ శాఖ ద్వార ప్రతిభ స్కాలర్షిప్‌లు ఇస్తామన్నారు. ఈ పరీక్షను విద్యాలయ స్కూల్ యాజమాన్యం బొప్పన విజయ భాస్కర్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బాలాజీలకు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోస్ట్ మాస్టర్ యన్ శ్రీనివాసరావు, తపాలా శాఖ అధికారులు, ఉద్యోగులు, విద్యాలయ స్కూలు సిబ్బంది పాల్గొన్నారు.



పరీక్షలలో పాల్గొన్న విద్యార్థులు

పలుచోట్ల 'పల్లె పండుగ' వారోత్సవాలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ పంచాయతీ శివారు కొత్తపేట గ్రామంలో పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్ రామ్ ముఖ్య అతిథిగా పాల్గొని ఉపాధి నిధులు 15 లక్షల 50 వేల తో చేపట్టిన మూడు సిసి రోడ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతి దేవి, జనసేన మండల పార్టీ అధ్యక్షులు గుడివాక శేషుబాబు, ఎంపీటీసీలు బొప్పన భాను, కటికల వసంత్, టిడిపి జనసేన నాయకులు గరికపాటి శ్రీను పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం :** ప్రగతి పదం వైపు గ్రామాలు పయనించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ముస్తాబాద్‌లో 71 లక్షల రూపాయలతో గ్రామంలో సిసి రోడ్ల శంకుస్థాపనకు ఆదివారం సాయంత్రం జరిగింది. నియోజకవర్గంలో అన్ని గ్రామాల లో సిమెంట్ రోడ్లు డ్రైనేజీలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి పి. దుర్గా శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, తెలుగుదేశం గ్రామ పార్టీ అధ్యక్షులు పాలడుగు మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ :** నందివాడ మండలంలోని అంబేద్కర్‌నగర్, నందివాడ, జొన్నపాడు, గండేపూడి, పొణుకుమాడు గ్రామాల్లో ఫిల్టర్ బెడ్ల మరమ్మతుల పనులకు ఎమ్మెల్యే రాము శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 43 గ్రామాల్లో ఫిల్టర్ బెడ్ల మరమ్మతులకు డిఎంఎఫ్ నిధులు రూ.91లక్షలు జిల్లా పరిషత్ నిధులు రూ.1.36 కోట్లు మంజూరయ్యాయని, మరో కోటి రూపాయల ప్రభుత్వ నిధులు మంజూరు కానున్నాయన్నారు. ఎంపిడిఓ మల్లీశ్వరి, టిడిపి నాయకులు పిన్నమనేని బాబ్జి, మండల టిడిపి అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గుడ్లవల్లేరు, మామిడికోళ్ల, డోకిపర్రు, కవుతరం, వెణుతురు మిల్లి గ్రామాల్లో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పలు సిసి రోడ్లకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ రోడ్ల అభివద్ధికి రూ 7. 50 కోట్లు కేటాయించి నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. పంచాయతీరాజ్ ఏఈ నాగేశ్వరరావు, ఎంపీడీవో విజయ సారథి, గ్రామ కార్యదర్శి ఏజెయల్ నరసింహారావు, గుడివాడ జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టిడిపి పార్టీ పుష్పవతి,నాయకులు వల్లభనేని వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-నాగాయలంక :** మండలంలోని పలు పంచాయతీల్లో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సిసి రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేసారు. పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాల కార్యక్రమం ద్వారా చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణం, విస్తత అభివద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, డీఈఈ పగడాల సురేష్ బాబు, ఏఈలు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి** గ్రామీణ అభివద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కషి చేస్తోందని నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ అన్నారు. ఆదివారం చల్లపల్లి మండలం లక్ష్మీపురంలో పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలలో భాగంగా ఉపాధి నిధులు 85 లక్షల 65 వేలతో నిర్మించ తలపెట్టిన 18 సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆదివారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొల్లూరు కోటేశ్వరరావు, సీనియర్ టీడీపీ నాయకులు సజ్జా చలపతిరావు, చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కష్ణకుమారి, ఎంపీటీసీలు మాలెంపాటి శ్రీనివాసరావు, నూకల వెంకటేశ్వరరావు, టీడీపీ గ్రామ అధ్యక్షులు గొరిపర్తి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-బంటుమిల్లి :** బంటుమిల్లి మండలం కొర్లపాడు, అర్తమూరు గ్రామాల్లో నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొని సిమెంట్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మహాకూటమి నాయకులు, కొర్లపాడు ప్రెసిడెంట్ అట్లూరు రమేష్, ఇల్లూరి లీలా కష్ణ, చొరంపూడి గోపాలకష్ణ, మల్లేశ్వరం కొండ, శివన్న సాంబశివరావు తదితర నాయకులు పాల్గొన్నారు



అవనిగడ్డ మండలంలో...



నందివాడ మండలంలో...



బంటుమిల్లి మండలంలో..



పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి : మంత్రి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా ఇటీవల కురిసిన వర్షాలు, సంభవించిన వరదల్లో మచిలీపట్నం మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులు అందించిన సేవలు వెలకట్టలేనివని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఇటీవల విజయవాడ వరదల్లో మచిలీపట్నం నుంచి వెళ్లి వరద బాధితులకు విశేష సేవలు అందించిన 250 మంది పారిశుద్ధ్య కార్మికులకు ఆదివారం ఉదయం మచిలీపట్నం నగరంలోని పంపులు చెరువు ఆవరణలో రూ.5 లక్షల విలువైన యూనిఫారం దుస్తులను మంత్రి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ బుడమేరుకు భారీ గండ్లు పడి సింగ్ నగర్ వంటి ప్రాంతాలను వరదలు ముంచెత్తాయన్నారు. ఈ క్రమంలో విజయవాడలోని వరద బాధితులకు సేవలను అందించేందుకు మచిలీపట్నం నగరం నుంచి 250 మందికి పైగా పారిశుధ్య కార్మికులు తరలి వెళ్లి బాధితులకు విశేష సేవలందించారని మంత్రి అభినందించారు. వారి సేవలకు గుర్తింపుగా ఈ యూనిఫారంతే కాకుండా తన వంతుగా ప్రతి ఒక్కరికీ నాణ్యమైన పాదరక్షకులు త్వరలో అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కోసం కోసం ఇప్పటికే వైద్య శిబిరాలు నిర్వహించామని, రానున్న రోజుల్లో మరిన్ని నిర్వహించి వారి ఆరోగ్యాన్ని కాపాడతామని హామీ ఇచ్చారు. మచిలీపట్నం నగరం డంపింగ్ యార్డులో లక్ష టన్నులకు పైగా చెత్త పేరుకుపోయిందని, రానున్న మూడు నుంచి 6 నెలల్లో ప్రత్యేకంగా కేటాయించిన నిధులతో తరలింపుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, కార్పొరేటర్లు, స్థానిక నాయకులు మాదివాడ రాము, వెంకట్రావు, నాగబాబు, , పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కొండలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న కొండలమ్మ అమ్మవారి ని ఆదివారం అధిక సంఖ్యలో యాత్రికులు దర్శిం చుకున్నారు. చుట్టు పక్కల గ్రామాల నుండే కాకుండా సుదూర ప్రాంతముల నుండి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీ కొండలమ్మ అమ్మవారి దర్శనమునకు విచ్చేసిన భక్తులకు ఏ విధమైన అసౌకర్యాలు, అవాంఛనీయ సంఘటనలు కలగకుండా గుడ్లవల్లేరు ఎస్సై సత్యనారాయణ తన సిబ్బంది తగు బందోబస్తు నిర్వహించారు. యాత్రికులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ కార్యనిర్వ హణాధికారి ఆకుల కొండలరావు తెలిపినారు.



మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-ఉంగుటూరు : పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వైద్య సౌకర్యాల కల్పన సవాలుగా మారిందని, గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన వైద్య సేవలను తక్కువ ధరలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వాలతో పాటు ప్రైవేటు వైద్య సంస్థలు, సేవా సంస్థలు దష్టి కేంద్రీకరించాలని పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు. మండలంలోని ఆత్కూరు స్వర్ణ భారత్ ట్రస్ట్ విజయవాడ చాప్టర్ లో పాస్టర్ రమేష్ హాస్పిటల్స్, అకీరా కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం శనివారం వెంకయ్య నాయుడు ప్రారంభించారు. ఈ వైద్య శిబిరానికి మొత్తం 500 మంది హాజరై వివిధ సమస్యలకు సంబంధించిన వైద్య సహాయాన్ని పొందారు.

బుడమేరు ఇసుక అడ్డగోలుగా తరలింపు

ప్రజాశక్తి - మైలవరం : ఇసుక అక్రమార్కుల ఆగడాలకు అంతేలేకుండా పోయింది. ఎటువంటి అనుమతులు లేకుండా వేలాది టన్నుల ఇసుకను మాయం చేస్తున్నారు. ఇందుకు దన్నుగా ఇటీవల ప్రభుత్వ పెద్దలు చెప్పిన మాటల్ని వక్రీకరించుకొని బుడమేరు ఇసుకను అడ్డగోలుగా తరలిస్తూ లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. గత కొద్ది కాలంగా మైలవరం నియోజక వర్గంలో లో బుడమేరు ఇసుకను అక్రమార్కుంగా తరలిస్తున్నారు. దీంతో పోలీసులు కొరడా ఝులిపించడంతో కొన్నాళ్లు నిలిచిపోయాయి. ఇంటి అవసరాలకు ఇసుకను ఇసుకను ట్రాక్టర్లలో, ఎడ్ల బండ్లలో ఉచితంగా తోలుకోవచ్చని ముఖ్యమంత్రి ప్రకటించడంతో తిరిగి ఇసుక తరలింపులు ప్రారంభమయ్యాయి. ఇందుకు సంబంధించి ఎటువంటి ఉత్తర్వులు వెలువడలేదని అధికారులు చెపుతున్నా రెండు, మూడు రోజులుగా తిరిగి ఇసుక తోలకాలు మొదలయ్యాయి. మైలవరం, వెల్వడం, గణపవరం గణపతి గట్టు రోడ్డు మధ్య బుడమేరు నుంచి కూలీలతో ట్రాక్టర్లలో ఇసుకను సురక్షిత ప్రాంతాలకు తరలించి అక్కడ నుంచి రాత్రి వేళ లారీలలో విజయవాడ, హైద్రాబాద్ వంటి దూర ప్రాంతాలకు ఒక్కక్క లారీకి రూ.25 వేల నుంచి రూ.40 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఈ సొమ్ముతో కొంతమంది కొత్త ట్రాక్టర్లను కూడా కొనుగోలు చేస్తున్నారని తెలుస్తోంది. మైలవరం మండలం గణపవరం, జి.కొండూరు మండలం చిన్న నందిగామ, వెల్లటూరు ప్రాంతాలలో సైతం ఇసుకను ముందుగా బుడమేరు సమీపంలోని ఇటుక బట్టీల వద్దకు తరలించి అక్కడ నుంచి రాత్రికి రాత్రే సుదూర ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీంతో ఇసుక అవసరమైన వారు బుడమేరు నుంచి తెచ్చుకోవడం కష్టమైంది. ప్రభుత్వ ఉత్తర్వులు రాకముందే పరిస్థితులు ఈ విధంగా ఉన్నాయి. ఇప్ప టికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించకుంటే కొద్ది రోజుల్లోనే బుడమేరులో ఇసుక అంతరించే ప్రమాదముంది.


గణపవరం గ్రామం గణపతి గట్టు రోడ్డులో డంపు చేసిన ఇసుక


ధర్నాలో పాల్గొన్న సిపిఎం నాయకులు బోయి సత్యబాబు, నారాయణ తదితరులు

ఇళ్ల పరిరక్షణ పోరాటానికి సిపిఎం మద్దతు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పాత రాజేశ్వరి పేటలో ఇళ్ల తొలగింపు ఆపాలని ఇళ్ళ పరిరక్షణ కమిటీ చేపట్టిన పోరాటానికి సిపిఎం మద్దతు ఇస్తున్నట్లు ఆ పార్టీ పశ్చిమ నగర కార్యదర్శి, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆ ప్రాంతానికి చేరుకుని వారికి సంఘీభావం తెలిపారు. అనంతరం సత్యబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాత రాజరాజేశ్వరిపేట ప్రజలకు ఇళ్ళ పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అందరికీ ఇళ్లు కల్పిస్తామన్న ప్రభుత్వం ఉన్న ఇళ్లను కూల్చడం సరికాదన్నారు. పాలకులు మారుతున్నారు గానీ ఇళ్ళ పట్టాలు రావడం లేదన్నారు. విలువైన స్థలాలపై ప్రభుత్వాల కన్ను పడిందన్నారు. విజయవాడ రైల్వేస్టేషన్ ప్రైవేట్ వారికి 90 ఏళ్ల లీజుకు ఇచ్చారు కానీ, పేదల ఇళ్ళ తొలగింపు విరమించుకోవాలని సిపిఎం పశ్చిమ నగర కార్యదర్శి, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఇ.వి.నారాయణ. కె.శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట:

పల్లె పండగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పిలుపుమేరకు మండలంలోని పోచంపల్లి గ్రామంలో రహదారులు అభివృద్ధి కొరకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన గ్రాంటు రూ.20 లక్షలకు సిసి రోడ్డు నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీ నాగిరెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్, టిడిపి రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కో కన్వీనర్ ముల్లంగి రామకృష్ణారెడ్డి, గ్రామ టిడిపి అధ్యక్షులు తేళ్లూరి వెంకట కృష్ణారెడ్డి, వార్డ్ మెంబర్ నంద్ర జయరాజు, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ ముల్లంగి సాంబశివరెడ్డి, ఎల్లంపల్లి రవి, మాజీ విద్యా కమిటీ చైర్మన్ గణపవరపు నరసింహారావు, మాజీ నీటి సంఘం అధ్యక్షులు ముల్లంగి రామకృష్ణారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ బంక అంబేద్కర్, గ్రామ నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

వృద్ధురాలు ఆత్మహత్య

ప్రజాశక్తి - విజయవాడ :

కృష్ణలంక పోలీస్‌స్టేషన్ పరిధిలో వృద్ధురాలు ఉరేసుకొని మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. మృతురాలి కొడుకు నరేంద్ర పోలీసులకిచ్చిన ఫిర్యాదు మేరకు కృష్ణలంక సుబ్బరాయ నగర్ ఐదో లైన్‌లో నివాసముంటున్న ఆరేళ్ల సరస్వతి (70) ఇంట్లో రేకుల షెడ్డుకు చీరతో ఉరి వేసుకొని మృతి చెందింది. ఈమె భర్త రామారావు రెండేళ్ల క్రితం మృతి చెందాడు. సరస్వతి మానసిక స్థితి బాగా లేదని, ఇంట్లోని రేకుల షెడ్‌కుఉరేసుకొని తన తల్లి మృతి చెందినట్లు నరేంద్ర తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ నాగరాజు తెలిపారు.


సమావేశం లో మాట్లాడుతున్న ఆశా వర్కర్ల జిల్లా కార్యదర్శి ఎ కమల

పెన్షన్లు పునరుద్ధరించాలి


ఆశా వర్కర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కమల

ప్రజాశక్తి నందిగామ : ఆశా కార్యకర్తలకు నిలిపి వేసిన వితంతు ఒంటరి మహిళా పెన్షన్లు పునరు ద్ధరించాలని ప్రభుత్వాన్ని ఆశ వర్కర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. కమల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నందిగామ మండలం ఆశా వర్కర్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం ఆదివారం సిఐటియు కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఎ.కమల మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు నిలిపివేసిన వితంతు ఒంటరి మహిళా పెన్షన్లు పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు అనే పేరుతో ఆశా కార్యకర్తలకు నిలిపివేసిన ఒంటరి, మహిళ వితంతు పెన్షన్లు తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో పేద ప్రజలకు గర్భిణీలు బాలింతలు పసిపిల్లలకు నిరంతరం ఆరోగ్య సేవలందిస్తున్న ఆశా వర్కర్ల పాత్ర ఎనలేనిది అన్నారు. కరోనా సమయంలో సైతం తమ ప్రాణాలను ప్రాణంగా పెట్టి ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా ఆశా వర్కర్ల చేసిన కృషి ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ప్రశంసించింది అని చెప్పారు. ఆశా వర్కర్లు అందరూ దళిత బహుజన వర్గాలకు చెందిన పేద మహిళలు ఎక్కువగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వీరికి కనీస వేతనం చెల్లించడం కాదని, రూ.10 వేలు మాత్రమే గౌరవ వేతనం ఇస్తుందని ఆశా వర్కర్స్‌కు కనీసం పిఎఫ్ ఇఎస్ఐ గ్రాట్యూటీ పెన్షన్ ఇవ్వాలని, సౌకర్యాలు కూడా వర్తించడం లేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా, వీరికి ఇచ్చే గౌరవ వేతనం కూడా చాలటం లేదని అనే ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నందిగామ మండల కార్యదర్శి కె.గోపాల్, ఆశ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి తిరుమల దేవి, వనజ, కవిత, రేణుక తదితరులు పాల్గొన్నారు.

లెనిన్ వర్ధంతి

ప్రజాశక్తి - విజయవాడ : రాణిగారితోట గుంటూరు బాపనయ్య భవన్‌లో ఆదివారం విఐ లెనిన్ శతవర్ధంతి కార్యక్రమం జరిగింది. ముందుగా లెనిన్ చిత్రపటానికి నాయకులు పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానుద్దేశించి డివిజన్ నాయకులు తమ్మిన చంద్రశేఖర్ మాట్లాడారు. విఐ లెనిన్ రష్యాలో సోషలిస్టు రాజ్యస్థాపన చేసి, ప్రపంచానికి ఒక వేగుచుక్కగా, దిక్సూచిగా నిలిచిన మహా నేత అని కొనియాడారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని దేశంలోని మతోన్మాదం, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎ కోటిరెడ్డి, కె వెంకటేశ్వర్లు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.





చైర్ లిఫ్ట్ పరిశీలన

ప్రజాశక్తి - వన్‌టౌన్ :

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి వృద్ధులు, వికలాంగుల కొరకు ఏర్పాటు చేసిన చైర్ లిఫ్ట్ సౌకర్యంతో ఇబ్బందులను తొలగిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కెఎస్. రామారావు తెలిపారు. ఈ సందర్భంగా యాత్రికులకు కల్పించిన లిఫ్ట్ చైర్ పనితీరును ఆదివారం ఇఒ రామారావు పరిశీలించారు. ఘాట్ రోడ్ ద్వారా అమ్మవారి దర్శనానికి విచ్చేయు వృద్ధులు, దివ్యంగులు మరియు నడవలేని వారు ఈ సదుపాయం వినియోగించుకోవాలని ఇఒ కోరారు. ఆదివారం సందర్భంగా ఉదయం నుండి అమ్మవారి దర్శనార్థం పెద్ద సంఖ్యలో యాత్రికులు విచ్చేశారు.

చంద్రలత పుస్తకాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రముఖ రచయిత్రి చంద్రలత రచించిన పుస్తకాలు ఆయువు పాట, నీలంపురాశి పుస్తకాల ఆవిష్కరణ పరిచయ సభ విజయవాడ శిఖర పాఠశాలలో ఆదివారం సాయంత్రం జరిగింది. ఆయువు పాట పుస్తకాన్ని ప్రముఖ కథా రచయిత్రి సత్యవతి ఆవిష్కరించారు. ఆయువుపాట పుస్తకాన్ని చినుకు రాజగోపాల్ సమీక్షించారు. తొమ్మిది దేశాల తొమ్మిది పాటలను తెలుగులోకి అనువదించిన తీరును, అందులోని భాషను రాజగోపాల్ వివరించారు. నీలంపు రాశి పుస్తకాన్ని బాలాంత్రపు ప్రసూన సమీక్ష చేశారు. వక్తలు చంద్రలత రచనా శైలిని విశ్లేషించారు. ఆమె పరిశోధన, రచనా శైలి, ఆమె తన రచనల కోసం చేసే అధ్యయనాన్ని వక్తలు విశ్లేషణ చేశారు. సభను ప్రముఖ కవి బండ్ల మాధవరావు నడిపించారు.


చంద్రలత పుస్తకాలు ఆవిష్కరిస్తున్న కథా రచయిత్రి సత్యవతి, తదితరులు

దుర్గమ్మను దర్శించుకున్న సత్యనారాయణ

శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం దుర్గమ్మను రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ మరియు కమిషనర్ ఎస్. సత్యనారాయణ ఆదివారం దర్శించుకున్నారు, భక్తుల రద్దీ సందర్భంగా ఆలయ ఈవో కె.ఎస్. రామారావుతో కలిసి ఏర్పాట్లను పరిశీలించి, క్యూ లైన్‌లోని పలువురు యాత్రికులతో మాట్లాడి ఏర్పాట్ల గురించి వారి అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ :

శామ్‌సంగ్ ఇన్నోవేషన్ కార్యక్రమంలో భాగంగా విజయవంతంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ఫ్యూచర్ టెక్ స్కిల్స్ సర్టిఫికెట్లను అందచేసినట్లు సంస్థ ఏరియా ప్రతినిధి ఎస్.మణికుమార్ తెలిపారు. నగరంలోని టెక్ స్కిల్స్ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేటర్ నోయిడా విశ్వవిద్యాలయంలో 400 మంది విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కోర్సును ప్రారంభించి పూర్తి చేసినట్లు తెలిపారు. ఇది యువతకు నైపుణ్యం అందించడం, డిజిటల్ ఇండియాను శక్తివంతం చేయడం కార్యక్రమంలో భాగంగా ఈ కోర్సును నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గౌతమ్ బుద్ధ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఆర్.కె.సిన్హ, పలువురు శామ్‌సంగ్ ప్రతినిధులు సర్టిఫికెట్లను అందచేశారు.

అభివృద్ధి పనులతో పల్లెల్లో పండుగ

- రూ.80 కోట్లతో 533 పనులకు శ్రీకారం
- 289 పంచాయతీల్లో వారోత్సవాలు
- ఎన్‌టిఆర్ జిల్లా డ్వామా పీడీ రాము





ప్రజాశక్తి-విజయవాడ

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'పల్లెపండుగ' కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎన్‌టిఆర్ జిల్లా డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) ఎ.రాము తెలిపారు. పంచాయతీలకు నిధులు-విధులు బదలాయింపులో భాగంగా ప్రతి పంచాయతీకి ప్రభుత్వం నిధులు కేటాయించి, పంచాయతీలకున్న అధికారాల ద్వారా క్షేత్రస్థాయిలో విజయవంతం చేసేందుకు ప్రతి మండలంలో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు. పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా ఎన్‌టిఆర్ జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు, నిధులు, వాటి అమలు తీరుపై పీడీ రాము 'ప్రజాశక్తి'కి ప్రత్యేక ఇంటర్వ్యూనిచ్చారు.

ప్రశ్న: 'పల్లె పండుగ' అమలు తీరు ఎలా ఉంది?

జవాబు: ఎన్‌టిఆర్ జిల్లాలో ఈ కార్యక్రమం పెద్ద ఎత్తున నడుస్తుంది. జిల్లాలోని 289 పంచాయతీల్లో మంజూరైన రూ.80 కోట్ల నిధులతో 533 పనులు వర్క్స్ చేపట్టాం. ప్రధానంగా సిసి రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేపడుతున్నాం. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి నియోజకవర్గం స్థాయిలో ఎమ్మెల్యేలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తూ....ఆ పనులు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ నెల 4వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశాం.

ప్రశ్న: ఇంకా గ్రామాల్లో ఏ పనులు చేపడుతున్నారు?

జవాబు: గ్రామాల్లో రైతులు, ఇతర తరగతుల ప్రజలకు సంబంధించిన పశువులకు ఉపయోగపడే విధంగా పశువుల కొట్టాలు, షెడ్లు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తుంది. జిల్లా వ్యాప్తంగా 399 కొట్టాలు, షెడ్లకు రూ.8.16 కోట్ల నిధులతో రెండు నెలల్లోపు ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలి. పాడిపశువుల రైతుల షెడ్లతో పాటు ప్రతి రైతుకు తనకున్న 50 సెంట్ల స్థలంలో పశుగ్రాసం పెంచుకునేందుకు రూ.50 వేలు ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుంది. అంతేగాక గ్రామాల్లోని ప్రతి ఇంటి పెరడులో ఇంకుడుగుంత నిర్మాణానికి రూ.6 వేలు ప్రభుత్వం డబ్బులు మంజూరు చేస్తుంది. ప్రతి మండలం పరిధిలో వెయ్యి ఇంకుడుగుంతల నిర్మాణాలను పూర్తి చేయాలి. వీటి ద్వారా జలవనరులు నిల్వ ఉంచుకోవడం, అంతేగాక మురుగునీటి డ్రెయిన్ల సదుపాయం అందుబాటులో లేని చోట ప్రతి లబ్దిదారుడు ఈ ఇంకుడుగుంతలను సైతం వినియోగించుకోవచ్చు.

ప్రశ్న: గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలులో భాగంగా ఏ పనులు చేపడుతున్నారు?

జవాబు: ఈ చట్టం ద్వారా జిల్లాలోని రెండు వేల ఎకరాల్లో వివిధ రకాల ఉద్యానవన పంటలు సాగు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తన 200 రోజుల లక్ష్యంగా 12 లక్షల బ్యాలెన్స్ పని దినాలు కల్పించాలనే లక్ష్యంగా గ్రామాల్లో పనులు చేపట్టాం. ముఖ్యంగా మామిడి, ఆయిల్‌పామ్, నిమ్మ, యాపిల్, డ్రాగెన్ ఫ్రూట్స్, మల్లెపూల చెట్లు పెంపకం చేపట్టాలి. సాధ్యమైన మేరకు జిల్లాలోని పనిలేని ప్రతి ఒక్కరికీ పని కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం. ఉద్యానవన పంటల పెంపకం పెద్ద ఎత్తున చేపట్టాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం.



సాబుజాన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

సాబుజాన్‌కు జాతీయ ప్రతిభా అవార్డు

ప్రజాశక్తి-బంటుమిల్లి : విద్యారంగంలో విశిష్ట సేవలు అందించినందుకు, ప్రైవేట్ విద్యాసంస్థల అభివృద్ధికి కృషి చేసినందుకు, ఎంతోమంది విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చినందుకుగాను అందించే జాతీయ ప్రతిభా అవార్డును బంటుమిల్లిలోని సెయింట్ జాన్స్ మోడల్ హైస్కూల్ డైరెక్టర్ సాబుజాన్‌కు ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు అందించారు. సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ అండ్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరులోని ఆంధ్ర క్రిస్టియన్ కాలేజ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును సాబుజాన్ అందుకున్నారు. ఈ సందర్భంగా సాబుజాన్‌ని పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఝాన్సీ సాబు, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలియజేశారు.

నేడు కలెక్టరేట్‌లో 'మీకోసం'

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తామనిజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రజలను కోరారు.



రోగులకు ఈసీజీ చేస్తున్న వైద్యులు

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం సూరంపల్లి జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం ఎంజే నాయుడు హాస్పిటల్స్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి రోగుల నుంచి విశేష స్పందన లభించింది. గ్రామ సర్పంచ్ శ్రీనివాసరావు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గ్రామీణ పేదలకు ఖరీదైన వైద్య సేవలను అందించడానికి కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యం ముందుకు రావాలన్నారు. రోగులకు మంచి వైద్య సేవలు అందించడంతోపాటు సామాజిక సేవలో భాగస్వామ్యం అవుతున్న ఎంజే నాయుడు హాస్పిటల్ వారిని అభినందించారు. ఈ వైద్య శిబిరంలో 289 మంది రోగులు పాల్గొని పరీక్షలు చేయించుకోవడంతో పాటు ఉచితంగా మందులు తీసుకున్నారు. వైద్య శిబిరాన్ని ఎం. జే నాయుడు హాస్పిటల్ గౌరవ అధ్యక్షులు వావిలాల రజనీకాంత్ శర్మ పర్యవేక్షించారు. డాక్టర్లు జ్యోతిక, గీతిక, సందీప్ లు రోగులకు వైద్య సేవలు అందించారు.

వసతి గృహాల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-అవనిగడ్డ : రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు అవనిగడ్డలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ వెనుకబడిన తరగతుల వసతి గృహాలను అవనిగడ్డ సబ్ కోర్ట్ సీనియర్ సివిల్ జడ్జ్, మండల న్యాయ సేవ అధికార కమిటీ చైర్మన్ బాబు నాయక్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఆదివారం రెండో వార్డ్ లోని వెనుకబడిన తరగతుల కళాశాల బాలికల వసతి గృహాన్ని అదేవిధంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రక్కన ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహం-2 బాలికల వసతి గృహం కళాశాల విద్యార్థుల వసతి గృహాలను ఆయన తనిఖీ చేశారు ఈ సందర్భంగా వసతి గృహాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు ముఖ్యంగా హాస్టల్ భవనాలు పరిస్థితిని పరిశీలించడంతోపాటు శానిటేషన్ తాగునీరు ఆహార పదార్థాలకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఆహార పదార్థాలు నిల్వ ఉంచే స్టోర్ రూములను తనిఖీ చేశారు మెనూ ప్రకారం వారికి ఆహారం అందుతున్నది లేనిది విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు అదేవిధంగా వారి నివసిస్తున్న భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంలో వారి రక్షణపై వసతి గహాల అధికారులను ప్రశ్నించారు. కొత్త భవనాల కోసం ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు జడ్జికి వివరించారు. 1971 లో బాలికల వసతి గహం నిర్మించగా అది శిథిలావస్థకు చేరుకుంది. దానిలో విద్యార్థులను ఉంచరాదని సూచించారు. అదేవిధంగా బాలుర మరొక భవనం స్లాబ్ పెచ్చులు ఊడిపోవడంతో అది కూడా విద్యార్థులు నివసించేందుకు శ్రేయస్కరం కాదని తెలిపారు. కాగా విద్యార్థినులు పాఠశాలకు కళాశాలకు వెళ్లేప్పుడు రహదారిపై వారికి అండగా వసతి గహాల అధికారులు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాదులు నరహరిశెట్టి ఈశ్వరరావు, చిట్టిప్రోలు ప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సనక రఘురాం ప్రసాద్, న్యాయవాది దామెర్ల నాగరాజు పాల్గొన్నారు.



కళాశాల బాలుం వసతి గృహంలో భోజనం పరిశీలిస్తున్న న్యాయమూర్తి బాబు నాయక్



విజయభాస్కర్‌కు అవార్డు అందిస్తున్న దృశ్యం

విజయభాస్కర్‌కు అబ్దుల్ కలాం అవార్డు

ప్రజాశక్తి - గుడివాడ : విద్యాలయ డైరెక్టర్ విజయభాస్కర్‌కు ప్రతిష్టాత్మక డాక్టర్ అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా అవార్డును రాష్ట్ర లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ ఆంధ్ర ప్రదేశ్ (ఎస్‌పి ఎల్‌టిఓ) ఆధ్వర్యంలో అందజేశారు. ఆదివారం గుంటూరు ఏసీ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ అవార్డును 2024 సంవత్సరానికి గుడివాడ విద్యాలయ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ బొప్పన విజయభాస్కర్‌కు ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు, మలినేని గ్రూప్స్ అధినేత మలినేని పెరుమాళ్ళు, ఎస్‌పిఎల్‌టిఓ రాష్ట్ర అధ్యక్షుడు నాగయ్య పర్యవేక్షణలో అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తూ, విద్యార్థు లను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్న విద్యాలయ డైరెక్టర్ విజయభాస్కర్‌కి అవార్డు అందిందన్నారు.

స్వచ్ఛ బందరుగా తీర్చిదిద్దేందుకు చర్యలు : మంత్రి



శ్రమదానంలో పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : శ్రమదానం కార్యక్రమం ద్వారా మచిలీపట్నం నగరాన్ని స్వచ్ఛ బందరుగా తీర్చిదిద్దడానికి ప్రతి పౌరుడు భాగస్వామ్యం కావాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం మంత్రి కూటమి నాయకులు, మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులతో కలిసి స్థానిక పంపులు చెరువు పరిసర ప్రాంతాల్లో శ్రమదానం కార్యక్రమం చేపట్టారు. మూడు స్తంభాల సెంటర్ నుంచి పాత పంపుల చెరువు గట్టుమీద పెరిగి పోయిన పిచ్చి మొక్కలు, ముళ్ళ పొదలతో అల్లుకుపోయిన చెరువుగట్టును శుభ్రం చేశారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ నా బంగారు బందరు-స్వచ్ఛ బందరు కోసం శ్రమదానం కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ప్రతి ఒక్కరి ఇంటి పరిసరాలతో పాటు బహిరంగ ప్రదేశాలను పరిశుభ్రం చేసుకోవడానికి ఒక పూట శ్రమదానం చేయడం ద్వారా బందరును స్వచ్ఛ నగరంగా మార్చగలమన్నారు. సిఎస్ఆర్, ఇతర నిధులతో అవసరమైన అభివద్ధి పనులను చేపడతామని హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో పార్కులు, డ్రైనేజీ నిర్మాణాలు, అవసరమైన చోట్ల స్మశాన వాటికలు ఏర్పాటుకు కార్యాచరణ రూపొందిస్తు న్నామని, కార్పొరేషన్ నుంచి వచ్చిన రూ.5 కోట్ల నిధులతో ఆయా అభివద్ధి పనులకు ఖర్చు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, కూటమి నాయకులు బండి రామకష్ణ, మాదివాడ రాము, సోడిశెట్టి బాలాజీ, కార్పొరేటర్లు, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి రెవెన్యూ సభలు

ప్రజాశక్తి - గంపలగూడెం : గత ప్రభుత్వం గ్రామాల్లో రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు భూముల రీ-సర్వే జరిగిన విషయం తెలిసిందే. అయినప్పటికీ ఇంకా ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వాటిని పూర్తి చేయడం కోసం నూతన ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. అందుకు ఈ నెల 21వ తేదీ నుండి నవంబర్ రెండో తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించి, అర్జీలు స్వీకరించనున్నట్లు గంపలగూడెం తాసిల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి తెలిపారు. 21వ తేదీ రాజవరం, 22 చెన్నవరం, 23 అనుములంక, 24 గంపలగూడెం, 25 కనుమూరు, 26 వినగడప, 29 గొల్లపూడి, 30 నెమలి, నవంబర్ ఒకటవ తేదీ కొత్తపల్లి, రెండో తేదీ పెద్ద కొమెర గ్రామాల్లో జరుగుతుందన్నారు. ఈ మంచి అవకాశాన్ని వినియోగించుకొని, శాశ్వత పరిష్కారాన్ని పొందాలని రైతులను కోరారు.



పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయాలి

ప్రజాశక్తి - నందిగామ : నాయకులు అందరూ బాధ్యత వహించి పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించాలని నందిగామ ఎంఎల్‌ఎ తంగిరాల సౌమ్య పేర్కొ న్నారు. ఆదివారం నందిగామ టిడిపి కార్యాలయంలో నందిగామ, చందర్లపాడు మండలం, నందిగామ రూరల్ టౌన్ క్లస్టర్ యూనిట్ పోలింగ్ బూత్ ఇన్చార్జిలతో విడివిడిగా సమావేశమయ్యారు. ఈ బాధ్యతను ప్రతిష్టాత్మకంగా తీసుకుని పట్టభద్రుల ఓటర్ల జాబితా రూపొందించాలని సూచించారు. నమోదు సమయం తక్కువ ఉన్నందున పట్టభద్రుల ఓట్ల నమోదు వేగవంతం చేయాలని కోరారు. గతంలో ఓటువేసుకున్నా మరలా కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న సిఐ నాయుడు

లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ ఏసీపి రవి కిరణ్ ఆదేశాల మేరకు నందిగామ సిఐ వైవిఎల్ నాయుడు ఆధ్వర్యంలో లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని, అందుకు చట్టపరంగా జరిమానా ఉంటుందని పట్టణ ఎస్సై నరేష్ హెచ్చరించారు. నందిగామ మెయిన్ రోడ్డులో లైసెన్స్ లేకుండా ద్విచక్రవాహనాలు నడుపుతూ పట్టు బడ్డ యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నపడరాదని, ప్రమాదాలు జరిగినప్పుడు చట్టపరంగా చర్యలుంటాయన్నారు. మద్యం, మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడపడం నేరమని, వాటికి యువత దూరంగా ఉండాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనం నడుపుతూ పట్టుబడితే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

రద్దీ ప్రాంతాల్లో మద్యం షాపులు... ట్రాఫిక్‌కు అంతరాయం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలో రద్దీ ప్రదేశాల్లో మద్యంషాపులు ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ అంతరాయంతో ప్రజలు అవస్థ లు పడుతున్నారు. స్కూల్ బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు రద్దీ, మరోవైపు మద్యం షాపులు మూడు ఏర్పడటం వల్ల బారత్ టాకీస్ సెంటర్ ట్రాఫిక్ అంతరాయానికి నిలయంగా మారింది. రోడ్డు ఇరువైపులా మందుల షాపులు, హాస్పటల్, మూలిక వైద్యుల వైద్యుల వ్యాపారులతో బారత్ టాకీస్ రోడ్డు కిక్కిరిసి పోతుంది. నూతన మద్యం పాలసీతో నందిగామలో మద్యం షాపులు అందంగా అలంకరించి రెండు రోజులు క్రితం ప్రారంభోత్సవాలు చేశారు. జె బ్రాండ్ మద్యం పోయి నాణ్యమైన మద్యం బ్రాండ్లు విక్రయాలు చేస్తున్నారు. పెద్ద ఎత్తున మద్యం కొనుగోళ్లు సాగుతున్నాయి. నందిగామ పట్టణంలో ఆరు మద్యం షాపులు ప్రభుత్వం కేటాయించింది. మూడు మద్యం షాపులు భారత్ టాకీస్ సెంటర్‌లో ఏర్పాటు చేశారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో మూడు మద్యం షాపులు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ స్తంబించి పోతుంది. వాహనాలు నిలిచి పోవడంతో పాదచారులు అడుగు ముందుకేసి పరిస్థితి లేకుండా పోయింది. మహిళలు, పాఠశాల విద్యార్థుల రాకపోకలకు తీవ్ర ప్రభావం చూపుతుంది. కనీస నిబంధనలు పాటించకుండా ఎక్సైజ్ అధికారులు వ్యాపారులు అడిగిన చోటే మద్యం షాపులు, పర్మిట్ రూమ్ లకు అనుమతులు ఇవ్వడం పై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరో షాపును కూడా ఇక్కడ పెట్టే ప్రయత్నం చేస్తుండటంతో ప్రజలు ఆందోళన చేస్తున్నారు. నందిగామ గాంధీ సెంటర్ లో గాంధీ విగ్రహం కి పది మీటర్ల దూరంలో పెద్ద ఎత్తున మద్యం షాపులు ఏర్పాటు చేయడం ఏమిటని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మద్యం షాపులు పక్కనే గ్లాసులు, కూల్ డ్రింక్స్, పాన్ షాపులు, చికెన్ కొట్లు ఏర్పాటు చేసి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారు. దీనికి తోడు నేరుగా మద్యం షాపులు యజమానులు రోడ్డు పై నిలబడి రండి రండి అంటూ మద్యం ప్రియులను ఆహ్వానిస్తుండటంతో ప్రజల నుండి విమర్శలు వస్తున్నాయి. రోడ్డు పై నిలబడి కేకలు వేయడం వల్ల ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు పెరుగు తున్నాయి. అధికారులు తక్షణమే స్పందించి బారత్ టాకీస్ సెంటర్ లో ఉన్న మూడు మద్యం షాపులు, గాంధీ సెంటర్ లో మద్యం షాపులు తొలగించి ఊరు చివర ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



నందిగామలో ట్రాఫిక్

ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఇటీవల కాలంలో పట్టణంలోని మిట్టగూడెం నాగవయ్య బజారులో టీడీపీ నాయకుల వేధింపులు, దౌర్జన్యాలకు గురైన గుగ్గిళ్ల శ్రీను ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులకు అండగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరుపున మన రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రూ.2 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. ఈ బ్యాంకు చెక్కును ఆదివారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్, నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్ (చిన్న) చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ హఫీజున్నీసా ఫిరోజ్ ఖాన్, మున్సిపల్ వార్డ్ కౌన్సిలర్ వట్టేం మనోహర్, పెనుగంచిప్రోలు ఎంపీపీ మార్కపుడి గాంధీ, వత్సవాయి ఎంపీపీ రమాదేవి, విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థాన డైరెక్టర్ నంబూరి రవి, సర్పంచ్ పాపినేని వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.



చందర్లపాడులో ప్రజాదర్బార్

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య చేపట్టిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం నందిగామ నియోజక వర్గం చందర్లపాడు మండలం కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజలు సౌమ్యని స్వయంగా కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఆర్థిక సాయం, పెన్షన్ మంజూరు, ఉద్యోగ అవకాశం ఇప్పించాలని వినతిపత్రాలు అందజేశారు. వినతిపత్రాలు స్వీకరించిన ఎంఎల్‌ఎ సౌమ్య తగిన న్యాయం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

జెవివి ఆధ్వర్యంలో వైద్యశిబిరం

ప్రజాశక్తి - తిరువూరు : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తిరువూరు నాగార్జున పాఠశాలలో నిర్వహిస్తున్న బిపి, షుగర్, పిట్స్ రోగుల వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదివారం తెల్లవారుజాము నుండే 5 గంటలకు దూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు వరుసక్రమంలో నిలబడి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి రెండు నెలలకు సరిపడా మందులను అందజేశారు. ప్రతి రెండు నెలలకు మూడు ఆదివారం నిర్వహిస్తున్న ఈ వైద్య శిబిరానికి ఉమ్మడి జిల్లాల నుండే కాకుండా సరిహద్దు ఏలూరు, ఖమ్మం జిల్లా నుండి కూడా వచ్చిన 1031 మంది రోగులకు జనవిజ్ఞాన వేదిక సభ్యులు స్వచ్ఛందంగా సేవలందించారు. షుగర్ బిపి రోగులు రెగ్యులర్‌గా మందులు వాడుతూ క్రమం తప్ప కుండా వ్యాయామం చేయాలని ఈ సంద ర్భంగా డాక్టర్ వల్లభనేని రవీంద్ర సూచిం చారు. కార్యక్రమంలో డాక్టర్లు శివాజీ, తేజ, లక్ష్మణరావు, జెవివి నాయకులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న వైద్యులు



ఎన్నికైన జ్యూయలరీ అండ్ మర్చెంట్స్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

నూతన కమిటీ ఏకగ్రీవం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ జ్యూయలరీ అండ్ మర్చెంట్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడుగా గొల్లపూడి వెంకట కృష్ణారావు, కార్యదర్శిగా కందుకూరి కృష్ణ కిషోర్, కోశాధికారిగా మారం శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శిగా జల్లా రాజేష్, కార్యవర్గ సభ్యులుగా కొప్పు మురళీ కృష్ణ, మాజేటి నవీన్ కుమార్, గొనుగుంట్ల లక్ష్మీ హరికృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

ప్రజాశకి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గంలోని 54వ డివిజన్ పంజా సెంటర్ శానిటరీ కార్యాలయం వద్ద ఆదివారం ఏఐటియుసి ఆధ్వర్యంలో కార్నర్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశంలో ఎఐటియుసి నాయకులు బుద్దె రాజా మాట్లాడుతూ విపత్తు సమయాలలో కూడా విధులు నిర్వర్తిస్తున్న మున్సిపల్ కార్మికుల సేవలు చాలా గొప్పవని కొనియాడారు. పారిశుద్ధ్య మెరుగుదలకు వారు చేస్తున్న కషి అనిర్వచనీయమని అన్నారు. ఆర్థికంగా వెనుకబడి అద్దె ఇళ్ళల్లో నివసిస్తున్న వీరందరికి పక్కా ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. పలు డిమాండ్ల సాధన కోసం ఈనెల 24వ తేదిన హనుమంతరాయ గ్రంథాలయంలో జరిగే సమావేశంలో మున్సిపల్ కార్మికులు అందరు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎంప్లాయిస్ నాయకులు తుపాకుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న బుద్దె రాజా

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - నందిగామ : పల్లెలు ప్రగతి పథంలో నడిపించేందుకు గాను కూటమి ప్రభుత్వం 'పల్లె పండగ' నిర్వహిస్తోందని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. నందిగామ నియోజకవర్గం కేంద్రంలో ఆదివారం పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు ఒక కోటి రూపాయల రోడ్డు అభివద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబు అజెండా అని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొందన్నారు. పల్లె పండుగతో గ్రామాలు, పల్లెల్లో నూతన వెలుగులు సంతరించుకుంటాయని పేర్కొన్నారు. మండలంలో రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడం సంతోషకరమని తెలిపారు. గ్రామాలలో సదుపాయాల కల్పనతోనే అభివద్ధి సాధ్యమని ఈ సందర్భంగా సౌమ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, గ్రామ మండల పార్టీ నేతలు, కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అన్నపూర్ణ సేవా సమితి వార్షికోత్సవం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో ఆదివారం అన్నపూర్ణ సేవా సమితి వ్యవస్థాపకులు మహంకాళి జయప్రకాష్ ఆధ్వర్యంలో అన్నపూర్ణ సేవా సమితి 10వ వార్షికోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గురాదామ్ వ్యవస్థాపకులు గెంటేల వెంకటరమణ, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, అన్నపూర్ణ సేవా సమితి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

టయోటా అర్బన్ క్రూయిజర్ టైజర్ విడుదల

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : పండుగ ఉత్సాహానికి మరింత సంతోషం జోడిస్తూ, టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) తమ అత్యంత ప్రజాదరణ పొందిన మోడల్ అర్బన్ క్రూయిజర్ టైజర్ కారు విడుదల చేసినట్లు సంస్థ ప్రతినిధి కె.కుమార్ తెలిపారు. నగరంలోని టొయోట షోరూంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఈ ప్రత్యేక ఎడిషన్, స్టైల్, ప్రీమియంనెస్‌ని మెరుగుపరచడంపై దృష్టి సారించి రూపొందించబడిందన్నారు. కస్టమర్లకు మరింత ఆనందం ఇస్తూ ఈ పరిమిత ఎడిషన్ రూ.20,160 విలువ కలిగిన టొయోటా జెన్యూన్ యాక్సెసరీస్ (టిజిఎ) ప్యాకేజీతో వస్తుందని తెలిపారు.

సమస్యలు పట్టించుకునే వారేరీ...?

● నెల రోజులు నుంచి ఖాళీగా మండల స్థాయి అధికారుల పోస్టులు ● ఇన్చార్జిలే ధిక్కా



కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని ఎంతో అభివద్ధి పథంలో నడిపించాలని అహర్నిశలు కషి చేస్తున్నప్పటికీ కింది స్థాయి అధికారులు లేకపోవడంతో ప్రజల సమస్యలు పట్టించుకునే వారే కరువయ్యారు. కనీసం బదిలీ అయ్యి నెలరోజులు దాటినా నేటికీ పదవీ బాధ్యతలు స్వీకరించక పోవడం గమనార్హం. ఆయా ప్రాంతాల్లోని ప్రజలు అధికారుల కోసం ఎదురుచూస్తున్నప్పటికీ సంబంధిత ప్రాంతాలకు వెళ్ళబోమని కార్యాలయా ల్లోని కాలం వెళ్లదీయడం పనితీరుకు అడ్డం పడుతుంది. దీంతో ఎఫ్ఎంసి (ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్)లతో పాటు పలు సమస్యలపై వచ్చే ప్రజలకు నిరాశే మిగులుతోంది.

ప్రజాశక్తి-పెడన : పెడన మండల తాసిల్దార్ కార్యాలయం కీలకమైన తాసిల్దార్, ఆర్ఐలతో పాటు పలు కింది స్థాయి అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికల విధుల్లో భాగంగా భీమవరం నుంచి వచ్చిన తాసిల్దార్ గా వచ్చిన రాంబాబు ఫలితాలు అనంతరం మళ్లీ అదే ప్రాంతానికి బదిలీపై వెళ్లారు. అనంతరం ఇన్చార్జిగా డిప్యూటీ తాసిల్దార్ కాగిత పూర్ణచంద్రరావును నియమించారు. తదనంతరం ఆయన సాధారణ బదిలీలలో భాగంగా బంటుమిల్లి, అలాగే ఆర్ఐ, వీఆర్వోలతోపాటు పలువురు వివిధ ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు. దీంతో డిప్యూటీ తాసిల్దార్గా కూనపరెడ్డి అనిల్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. అంతేకాకుండా ఇంచార్జ్ తాసిల్దార్గా కూడా నియమించారు. అలాగే మండల పరిధిలోని కాకర్లమూడి విఆర్ఓ కట్ట వీరబాబు ఉరివి పంచాయతీకి బదిలీపై వెళ్లారు. నెలరోజులు దాటినప్పటికీ నేటికీ సచివాలయ సిబ్బందికి అలాగే గ్రామ ప్రజలకు ఒక్కసారి కూడా కనిపించలేదంటూ చెబుతున్నారు. అంతేకాకుండా ఇటీవల కురిసిన అకాల వర్షాలకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నష్టపరిహారం కేవలం వీఆర్వో అందుబాటులో లేకపోవడమే తమకు రాలేదని ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా కమలాపురం వీఆర్వో అంకాలరావు నెలరోజుల క్రితమే గూడూరు మండలం రాయవరం కు బదిలీపై వెళ్లాలని ఉన్నతాధి. కారులు ఉత్తర్వులు జారీ చేశారు. కానీ నేటికీ పెడన తాసిల్దార్ కార్యాలయంలోని కాలాన్ని వెలదీస్తున్నారని తోటి ఉద్యోగులు చెబుతున్నారు. అంతేకాకుండా కాకర్లమూడి విఆర్ఓగా ఉన్నతాధికారులు ఎవరిని నియమించలేదు. అదే గ్రామానికి చెందిన వీఆర్ఏ కూడా పంచాయతీలోని ప్రజలకు అందుబాటులో లేకుండా తాసిల్దార్ కార్యాలయంలోని త్రిష్ట వేస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇలా అటు బదిలీల్లో భాగంగా కేటాయించిన స్థానంలోకి స్థానచలనం కలిగినప్పటికీ వెళ్ళకుండా విధులకు గైహాజరు అవడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ములుగుతున్న కోటి 20 లక్షలు...

ఆరు నెలల క్రితం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఖర్చులు నిమిత్తం నియోజకవర్గానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిధులను విడుదల చేసింది. దాదాపు పది రోజులు దాటినప్పటికీ వాటిని సద్వినియోగం చేయడంలో కీలక అధికారులు లేకపోవడం వల్లనే నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తెలుస్తోంది. తాసిల్దార్, డిప్యూటీ తాసిల్దార్ రెండు పోస్టులు భర్తీ కాకపోవడం ఎన్నికల ఖర్చుల నిమిత్తం విడుదల చేసిన నిధులు అలాగే ఉన్నాయి. వీటిని విధి నిర్వహణలో భాగంగా ఉపయోగించిన వాహనాలు, మైకులు, వీడియో గ్రాఫర్లు, ఆటోలు, భోజన వసతి, టెంట్ హౌస్ ఇలా పలువురికి సమకూర్చాల్సి ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిధులను త్వరలోనే సద్వినియోగం చేయాలని పలువురు కోరుతున్నారు. దీనిపై డిప్యూటీ తాసిల్దార్ కూనపురెడ్డి అనిల్ కుమార్ను వివరణ కోరగా వీఆర్వోలను బదిలీ చేసిన మాట వాస్తవమేనని అయితే ఇంకా రికార్డులు పూర్తిస్థాయిలో అప్పగించ లేదన్నారు. అలాగే ఎన్నికల నిధుల గురించి ప్రస్తావించగా ప్రస్తుతం ఈ నిధులు ఉన్నతాధికారుల వద్ద ఉన్నాయని త్వరలోనే వాటిని పంపిణీ చేస్తామని చెప్పారు.

క్షేత్రస్థాయిలో ప్రజలకు సేవలందించాలి : మంత్రి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : క్షేత్రస్థాయిలో ప్రజలకు అవసరమైన సేవలు అందించేందుకు కషి చేయాలని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. ఆదివారం నగరంలోని మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయ అడ్మిన్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పింఛన్ల పంపిణీలో సచివాలయ ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమైందని, పింఛన్ల పంపిణీ సజావుగా సాగేందుకు వారు ఎంతో కషి చేస్తున్నారని మంత్రి అభినందించారు. సచివాలయానికి అడ్మిన్ నాయకుడు లాంటివాడని, సచివాలయంలోని మిగిలిన సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ బందరు అభివద్ధిలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. ప్రతి సచివాలయ ఉద్యోగి వారి పరిధిలోని సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని, అందుకు ప్రతిరోజు వారు క్షేత్రస్థాయిలో సందర్శించి ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తన దష్టికి తీసుకురావాలని మంత్రి సూచించారు.ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్పర్సన్ గొర్రెపాటి గోపీచంద్, కూటమి నాయకులు బండి రామకష్ణ, ఇలియాజ్ బాషా పాల్గొన్నారు.

ముగిసిన పూర్ణాహుతి



ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : శ్రీ విద్యా దత్త సాయి పీఠం ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా జరుగుతున్న లక్ష్మీ గణపతి సహిత శత చండీ యాగం ఆదివారం నాటితో ఘనంగా ముగిసింది. బెంజిసర్కిల్ వద్ద గల నలంద విద్యా సంస్థల ప్రాంగణంలో ఆదివారం జరిగిన ముగింపు వేడుకలలో ఆదివారం సాయంత్రం పూర్ణాహుతితో యాగం కన్నులపండుగగా ముగిసింది. కార్యక్రమంలో భాగంగా ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించామని కార్యక్రమంలో పాల్గొన్న వారికి ప్రసాదాలను అందచేసినట్లు ప్రముఖ విద్యావేత్త ఫణి ప్రసాద్ ముక్తేవి తెలిపారు. చండీ హెూమానికి ఎంతో విశిష్టత ఉందని, ప్రతి ఒక్కరికీ ఆశీస్సులు అందచేయాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈకార్యక్రమానికి స్థానికుల వద్ద నుండి మంచి స్పందన లభించిందని తెలిపారు.


మెట్రో ఫెస్టివ్ గిఫ్ట్ సేల్ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడఅర్బన్ : ప్రముఖ హోల్సేల్ సంస్థ అయిన మెట్రో సంస్థ పండుగల సందర్భంగా మెట్రో ఫెస్టివ్ గిఫ్ట్ సేల్ను ప్రారంభించినట్లు సంస్థ ఇన్ఛార్జి ఇ.వరుణ్ ఒక ప్రకటనలో తెలిపారు. మెట్రో సంస్థ 21 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా పండుగ ఆఫర్లు అందించాలనే ఉద్దేశంతో ప్రత్యేక సేల్ను ప్రారంభించినట్లు తెలిపారు. అన్ని మెట్రో దుకాణాల్లో ఈ ఆఫర్లు వర్తిస్తాయని నవంబరు 3 వరకు జరిగే ప్రత్యేక సేల్లో కొనుగోలు చేసిన వారికి ప్రత్యేక బహుమతులు కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. మెట్రో హెూల్సేల్ స్టోర్లలోనే కాకుండా మెట్రో హోల్సేల్ యాప్లోనూ, మెట్రో వెబ్సైట్లోనూ ఆర్డర్ ద్వారా కొనుగోలు చేసి బహుమతులు పొందే అవకాశం కల్పించినట్లు తెలిపారు.

ఎంఎల్సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించాలి



ప్రజాశక్తి-ఉయ్యూరు : రానున్న గుంటూరు కృష్ణా పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో పిడిఎఫ్ నుండి పోటీ చేసే అభ్యర్థి కె. లక్ష్మణరావుని గెలిపించాలని కోరుతూ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కెఎ ఉమామహేశ్వరరావు కోరారు. ఆదివారం ఉయ్యూరు విజ్ఞాన కేంద్రంలో జిల్లాలోని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.సదస్సులో ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ నేటి ప్రభుత్వాలు సామాజిక దక్పథం విడిచి కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నాయని, వాటికి వ్యతిరేకంగా వామపక్ష అభ్యు దయ భావాలు కలిగిన అభ్యర్థులను గెలిపించుకోవాలని అన్నారు. మండలాల వారీగా పట్టభద్రులైన ఓటర్లను చేర్పించే ప్రక్రియ చేపట్టాలని ఆయన కోరారు. పట్టభద్రుల అనేక సమస్యలపై శాసనమండలిలో గళమెత్తాలంటే పిడిఎఫ్ బలపరిచిన అభ్యర్థులను ఎన్నికల్లో గెలిపించాలని ఆయన ఆకాంక్షించారు. పట్టభద్రులైన ఓటర్లకు అవగాహన కల్పించి ఓటు చేర్పించాలని ఆయన తెలిపారు. సిఐటియు జిల్లా నాయకులు వై. నరసింహారావు, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా బాధ్యులు పీవీ రమణ హబీబ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈకార్యక్రమంలో కౌలు రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు పంచకర్ల రంగారావు, కే శివ నాగేంద్రం, రైతు సంఘం మండల అధ్యక్షులు అన్నే సుబ్బారావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సమరం, ప్రేమ్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు కంభం కొండల బాబు, ప్రజా సంఘాల నాయకులు తాడంకి నరేష్, బి. రాజేష్, కళ్లం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : వివిధ అనారోగ్య సమస్యలతో రాష్ట్ర ముఖ్యమంత్రి నుంచి ఆర్థిక సహాయాన్ని కోరిన 14 మంది లబ్ధిదారులకు రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర రూ.29.35 లక్షల చెక్కులను లబ్ధిదారులకు ఆదివారం మధ్యాహ్నం నగరంలోని తన నివాసంలో అందించారు. చేసిన సహాయానికి రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు మంత్రి కొల్లు రవీంద్రకు ఈ సందర్భంగా లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, డివిజన్ ఇన్చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చతుర్ధశి వేడుకలు



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - గుడివాడ : పట్టణంలోని మెయిన్ రోడ్డులో శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థాన మండపంలో ఆశ్వయుజ మాసం బహుళ చవితి సంకటహర చతుర్ధశి వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా నిర్వహించిన లక్ష్మీ గణపతి హెూమ పూజల్లో 93 మంది దంపతులు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితులు పూజా కార్యక్రమాలు ముగిసిన అనంతరం హెూమగుండంలో పూర్ణాహుతిని సమర్పించారు. లోక కళ్యాణార్థమే దేవస్థానంలో సంకటహర చవితి రోజున శ్రీలక్ష్మీ గణపతి హెూమ పూజలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు (వాసు) తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

23న ధర్నాను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - విజయవాడ : వరద బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ 23వ తేదీ, బుధవారం సింగ్నగర్ తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శివర్గసభ్యులు కె దుర్గారావు కోరారు. స్థానిక వాంబే కాలనీ 60 డివిజన్లోని జంధ్యాల దక్షమూర్తి స్కూల్ 'జి' బ్లాకు సి' బ్లాక్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో వరద బాధితుల దరఖాస్తులను పూర్తి చేసే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ బుడమేరు ముంపు కారణంగా వాంబే కాలనీలో ప్రజలు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. ప్రభుత్వం అందిస్తానన్న సహాయం కొంతమందికి మాత్రమే అందిందని విమర్శించారు. సహాయం అందని లబ్ధిదారులు గత 15 రోజులుగా పనులు మానుకొని కలెక్టరేట్, తహశీల్దార్ కార్యాలయం, సచివాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే పరిస్థితి లేదని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వరద బాధితులు అందరికీ న్యాయం చేయాలని కోరుతూ సి.పి.ఎం ఆధ్వర్యంలో బుధవారం జరిగే ధర్నాలో వరద బాదితులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పార్టీ నగర కమిటీ సభ్యులు ఎస్.కె పీరు సాహెబ్, శాఖ కార్యదర్శి ఎ. రత్నకుమారి, డి రజిని, స్థానిక నాయకులు ఎన్. మహేష్, దావీదు పాల్గొన్నారు. ధర్నాలో వరద బాధితులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి భూపతి రమణారావు కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రకటన విడుదల చేశారు.



లబ్ధిదారుల దరఖాస్తులు పూర్తి చేస్తున్న నాయకులు

శామ్‌సంగ్ గెలాక్సీ ఎ16 విడుదల

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :
అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన శామ్‌సంగ్, యువత కోసం సరికొత్తగా గెలాక్సీ ఏ16 5జిని విడుదల చేసినట్లు శాంసంగ్ రీజనల్ ఇంఛార్జి కె.వరుణ్ ఒక ప్రకటనలో తెలిపారు. 18,999ల సరసమైన ధరలో వినియోగదారులకు అద్భుతమైన ఆఫర్లతో అందిస్తుందన్నారు. ఆరు తరాల ఒఎస్ అప్‌గ్రేడ్‌లు, ఆరేళ్ల భద్రతా నవీకరణలను అందించడం ద్వారా మధ్య శ్రేణి స్మార్ట్‌ఫోన్‌ల కోసం కొత్త ప్రమాణాన్ని గెలాక్సీ ఏ16 5జి నిర్దేశించనుందని తెలిపారు. సామ్‌సంగ్ గెలాక్సీ ఏ16 5జి రెండు వేరియంట్‌లలో లభిస్తుందని తెలిపారు. గోల్డ్, లైట్ గ్రీన్, బ్లూ బ్లాక్ వంటి అధునాతన రంగుల్లో రిటైల్ స్టోర్‌లు, సామ్‌సంగ్, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లలో అందుబాటులో ఉంటుందని తెలిపారు.

విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ నూతన కార్యవర్గం

- అధ్యక్షులుగా కె.లక్ష్మయ్య ఎన్నిక

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :
విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ 2024-25 సంవత్సరానికి అధ్యక్షులుగా ప్రజాశక్తి బుక్‌హౌస్ కె.లక్ష్మయ్య ఎన్నికయ్యారు. గవర్నరుపేటలోని బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో ఆదివారం వార్షిక సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నికున్నారు. ఉపాధ్యక్షులగా జక్కంపూడి ప్రసాద్ (జె.పి. పబ్లికేషన్స్), కార్యదర్శిగా టి.మనోహర్ నాయుడు (విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్), సహాయ కార్యదర్శిగా కొండపల్లి రవి (నవసాహితీ బుక్‌హౌస్), కోశాధికారిగా జి.లక్ష్మి (సాహితీ ప్రచురణలు) ఎంపికయ్యారు. వర్కింగ్ కమటీ సభ్యులుగా గోళ్ల నారాయణరావు (సుజాత పబ్లికేషన్స్), విశ్వేశ్వరరావు (సాహితీ మిత్రులు), కొల్లూరి (ఎక్స్‌రే), ఎ.భాస్కరరావు (స్పందన పబ్లికేషన్స్), బి.రవికుమార్ (నవరత్న బుక్‌హౌస్), కె.శ్రీనివాస్ (జన విజ్ఞాన వేదిక), వి.శ్రీనివాసరావు (శ్రీ నిహిల్ పబ్లికేషన్స్), పి.సుబ్రహ్మణ్యం (వాసు బుక్‌హౌస్), జ.నరసింహమూర్తి (సుధ బుక్‌హౌస్) ఎంపికయ్యారు.

స్వచ్ఛతా హి సేవపై అవగాహన పెరగాలి

సినీ నటుడు సుధీర్ బాబు



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : స్వచ్ఛతా హి సేవ అనేది కేవలం వాక్‌థాన్‌తో ముగిసిపోకుండా మనందరి నిత్య జీవితంలో ఒక భాగంగా కొనసాగాలని సినీ హీరో సుధీర్ బాబు పిలుపునిచ్చారు. ఆదాయ పన్ను శాఖ స్వచ్ఛతా హి సేవ లో భాగంగా ఆదివారం నిర్వహించిన వాక్ థాన్ ర్యాలీని ఉద్దేశించి ముఖ్య అతిథిగా బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, సినీ హీరో సుధీర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడలో విద్యార్థులతో వాక్‌థాన్ రన్‌లో పాల్గొనటం సంతోషంగా ఉందని, వీళ్లందర్నీ చూస్తుంటే ఎంతో ఎనర్జిటిక్ గా కూడా ఉందని తెలిపారు. మంచి ఉద్దేశ్యం కోసం మనందరం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్ తరాల కోసం ఒకడుగు ముందుకు వేసి మన ఇంటితోపాటు, పరిసరాలను, చుట్టుపక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. స్వచ్ఛతా హి సేవ గురించి మన చుట్టుపక్కల వారికి, ఫ్యామిలీ మెంబర్స్‌కి, ఫ్రెండ్స్‌కి, తెలిసిన వారికి తెలియజెప్పాలన్నారు. నేను పుట్టి పెరిగింది విజయవాడలోనే అని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. విజయవాడ వీధులు అప్పటికి, ఇప్పటికి చూస్తే ఇప్పుడు చాలా క్లీన్‌గా ఉన్నాయన్నారు. విద్యార్థులు ఇలాంటి మంచి కార్యక్రమాల్లో పాల్గొనటం చాలా సంతోషమన్నారు. ప్రతి ఒక్కరూ ఇందులో పాల్గొనాల్సిన బాధ్యత ఉందన్నారు. విజయవాడ ఆదాయపు పన్ను శాఖ ప్రధాన కమిషనర్ వీరేందర్ మెహెతా మాట్లాడుతూ స్వచ్ఛతా హి సేవా రన్ ప్రచారంలో విద్యార్థులు పాల్గొనటం చాలా సంతోషదాయకం అన్నారు. హైద్రాబాద్ ఆదాయపు పన్ను శాఖ ప్రధాన కమిషనర్ సురేష్ బత్తిని మాట్లాడుతూ ప్రధాని మోదీ చొరవను ముందుకు తీసుకెళ్లడం యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. స్వచ్ఛతా హి సేవ పై ప్రజలందరూ ఎంతో అవగాహన కలిగి, ఒక అలవాటుగా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న విద్యార్థులను ఆయన అభినందించారు. విజయవాడ ఆదాయపు పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ సునీత బిల్లా మాట్లాడుతూ విద్యార్థులు భావి భారతదేశ పౌరులుగా వారు స్వచ్ఛమైన, హరిత భారతదేశాన్ని రూపొందించడంలో చురుకైన పాత్ర పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి పెద్ద సంఖ్యలో ముందుకు వచ్చిన విద్యార్థులను అభినందించారు. వాక్‌థాన్ రన్ లాంటి కార్యక్రమాల వల్ల ప్రజల్లో అవగాహన పెంపొందే అవకాశం ఉందన్నారు. ముందుగా అందరి చేత స్వచ్ఛతా హి సేవపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సినీ హీర్ సుధీర్ బాబు వాక్ థాన్ రన్ ను బందర్ రోడ్డు లోని ఆదాయ పన్ను శాఖ కార్యాలయం నుండి జెండా ఊపి ప్రారంభించారు. అక్కడ నుండి మొఘల్ రాజ్ పురం ఆదాయ పన్ను శాఖ కార్యాలయం వరకు ఈ వాక్‌థాన్ రన్ కొనసాగింది. ఈ కార్యక్రమంలో విజయవాడ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పిఐబి) డీజీ రాజేంద్ర చౌదరి, గుంటూరు ఆదాయపు పన్ను శాఖ అదనపు కమిషనర్ శ్రీమతి సుప్రియ, విజయవాడ ఆదాయపు పన్ను శాఖ జాయింట్ కమిషనర్ అభినయ. ఎన్, ఆదాయపు పన్ను శాఖ అసిస్టెంట్ కమిషనర్ దోనేపూడి విజయ్ బాబు, ఆదాయపు పన్ను శాఖ అధికారులు శ్యామలాదేవి, ఈశ్వరరావు, రామ్ ప్రసాద్, రాఘవులు, విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్, ఎన్ సీసీ విద్యార్థులు, ఇతరులు పాల్గొన్నారు.

22 నుండి విజయవాడలో చెస్ టోర్నమెంట్



ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : బి.యన్.కె.యు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22 నుండి 27వ తేదీ వరకు నగరంలోని ఐకాన్ ఫబ్లిక్ స్కూల్‌లో 1వ ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఐకాన్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ రాజేంద్ర, టోర్నమెంట్ కన్వీనర్ ఎస్.కె.ఖాసిం తెలిపారు. సీతారాంపురంలోని ఐకాన్ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అఖిల భారత చదరంగ సమాఖ్య, ఆంధ్ర చెస్ అసోసియేషన్, ది విజయవాడ చెస్ అసోసియేషన్ సంయుక్తంగా ఈఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తుందని తెలిపారు. ఆరు రోజుల పాటు జరిగే ఈటోర్నమెంట్ మూడు రకాల చెస్ ఫార్మాట్‌లలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్లాసికల్, ర్యాపిడ్, బ్లిట్జ్‌లలో పోటీలు ఉంటాయని తెలిపారు. విజేతలకు ఓపెన్ విభాగంలో రూ.10 లక్షలు, ర్యాపిడ్ విభాగంలో రూ.3 లక్షలు, బ్లిట్జ్ విభాగంలో రూ.2 లక్షలు నగదు బహుమతి కలిపి మొత్తం 15 లక్షల నగదు బహుమతి విజేతలకు ఇవ్వనున్నట్లు తెలిపారు. మూడు విభాగాల్లో పోటీలు స్విస్ లీగ్ పద్ధతిలో ప్రతి విభాగంలో 9 రౌండ్లు పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే మూడు దేశాల నుండి క్లాసికల్ విభాగంలో 500 మంది క్రీడాకారులు, ర్యాపిడ్ విభాగంలో 300 మంది క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. ఇద్దరు గ్రాండ్ మాస్టర్లు, 12 మంది ఇంటర్నేషనల్ మాస్టర్లు, 300 మందికిపైగా ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ కలిగిన క్రీడాకారులు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రచెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి మందుల రాజీవ్, టోర్నమెంట్ డైరెక్టర్ విత్తనాల కుమార్, ఇంటర్నేషనల్ ఆర్బిటర్ అమ్మినేని ఉదయ్‌కుమార్, బియన్‌కెయు డైరెక్టర్ బీమారావు పలువురు పాల్గొన్నారు.